క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి సంగీత నృత్యనికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన సాగింది. 14 మంది నృత్యకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

పాత శివాలయంలో శ్రమదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గుంటూరుకు చెందిన ప్రణవ పీఠం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని శివాలయంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రణవ పీఠం ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న మన గుడి, బడి కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణమంతా శుభ్రపరిచి కడిగారు. పిచ్చి మొక్కలు తొలగించి, ధ్వజస్తంభం దగ్గర నుంచి మెట్ల వరకు ప్రతి ఒక్క భాగాన్ని తుడిచి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రణవ పీఠం సభ్యురాలు భాగ్యశ్రీ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని ఎంచుకుని శుభ్రపరచడంతో పాటు పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రణవ పీఠం సభ్యులు పాల్గొన్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు కస్తూరిభా ఆశ్రమం ప్రాంతానికి చెందిన షేక్. సైదాబీ, ఉద్దాండ్ సాహెబ్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భర్త ఉద్దాండ్‌సాహెబ్ టైలరింగ్ పని చేస్తుండగా, సైదాబీ మెడికల్ కంపెనీలో పని చేస్తుంటుంది. మొదటి కుమార్తెకు వివాహం కాగా, రెండో కుమార్తె(17) స్థానికంగా ఉన్న కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటున్న బాలిక శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పదకవిత.. సామాజిక చైతన్య గీతిక



విజయవాడకల్చరల్: పదకవిత సామాజిక చైతన్యగీతిక అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు 615వ జయంతి అన్నమయ్య స్వరార్చన, అంతర్జాతీయ మాతృ దినోత్సవం, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక నిర్వాహకుడు నూకవరపు ప్రసాదరావు ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల్లో అద్భుతమైన తెలుగు పదాలు కనిపిస్తాయని నేడు కొన్ని కనుమరుగైపోయాయన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శేషుకుమార్ మాట్లాడుతూ.. కనిపించే ప్రత్యక్షదైవమని అమ్మ అని, సేవానికి త్యాగానికి చిరునామా అమ్మ అని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ట్రెజరరీ ఆఫీసర్ రెహమాన్, జి.నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాజ్యలక్ష్మి, మీనాకుమారి, వడ్డాది సూర్యకామేశ్వరి, దుర్గానాగమణి, మల్లాది స్వాతి, డేవిడ్‌రాజు, శివశంకర్, జగన్‌మోహనరావు అన్నమయ్య కీర్తనలతో పాటు పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయకులను మాతృ దినోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రామభక్త.. హనుమాన్‌కీ జై

- మార్మోగిన హనుమాన్ నామస్మరణ
- వాడవాడలా వైభవంగా హనుమత్ జయంతి ఉత్సవాలు



వన్‌టౌన్‌లో విశేష అలంకారంలో స్వామి వారు



హనుమత్ దీక్షా పీఠంలో స్వామి వారి మూలవిరాట్



దీక్షలు విరమింపజేస్తున్న పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ



సంకల్పసిద్ధి హనుమాన్‌కు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు



వెంకన్న సన్నిధిలో హనుమంతునికి తిరుమంజనం



వాగు సెంటర్‌లో పూజలు చేస్తున్న అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలో హనుమత్ జయంతి వేడుకలను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు భక్తులు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. హనుమాన్ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లను చేశాయి. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని అంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయంలో మూల విరాట్‌కు ఆలయ అర్చకులు ఖండపల్లి త్రినాథాచార్యులు, పరాశరం పవన్‌కుమార్ ఆచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మలు పూజా కార్యక్రమాలను చేశారు. 48 మంది దంపతులచే హనుమత్ వ్రతం నిర్వహించగా, స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హనుమత్ దీక్షా పీఠంలో..

పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో హనుమత్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. అభయ వీరాంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహించారు. పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీ చేతుల మీదగా పలువురు దీక్షలను విరమించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒరిస్సాల నుంచి విచ్చేసిన భక్తులు దీక్షలను విరమించారు. పీఠంలో ఏర్పాట్లను ఓంకార్, యజ్ఞేశ్వరరావు, శంకర్(చైతన్య), గౌరీశంకర్, అద్దూరి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

భీమన వారి పేటలో..

భీమన వారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, తమలపాకులతో అర్చన, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణతో పాటు పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు.

రాయప్ప రాజు వీధిలో...

టీనర్‌పేట రాయప్ప రాజు వీధిలో వేం చేసిన శ్రీ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైష్ణవాలయాలతో పాటు శైవాలయాల్లోనూ ఆంజనేయస్వామి వారి జయంతి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. కొత్తపేటలోని అత్యంత విశిష్టత కలిగిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో తెల్లవారుజామున మూడు గంటలకు స్వామి వారి మూలమూర్తికి పంచామృత తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వేరువేరుగా స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కొత్త గుళ్ల కోదండరామాలయంలో....

శేషయ్యవీధిలోని శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానం(కొత్త గుళ్లు) ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి వారికి తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం రజిత హనుమత్ వాహనంపై కోదండరాముని ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు. శ్రీరామమంత్ర జపాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో....

బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సువర్చాల సమేత హనుమత్ స్వామి వారి ఉత్సవమూర్తికి, ఆలయంలోని ఉపాలయాల్లోని స్వామి వారి మూలమూర్తులకు ఉదయం తిరుమంజనం నిర్వహించారు. ఆలయ అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, పూజలను జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పలు ఆలయాల్లో..

పంజా సెంటర్ సమీపంలోని రైల్వేపోర్టర్స్ కమిటీ ఆధ్వర్యంలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో తిరుమంజన, స్వామి వారికి ఆకుపూజలను, సహస్రనామార్చనలను నిర్వహించారు. వించిపేట రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి వారికి విశేష అర్చనలు, ఆకుపూజలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) ఆంజనేయస్వామి ఉపాలయంలో విష్వక్సేనపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. సహస్రనామార్చన, అష్టోత్తర కమలములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రాచకొండ సుమంతశర్మ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

సంకల్ప సిద్ధి హనుమాన్‌కు విశేష అలంకారం

శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న శ్రీ సంకల్పసిద్ధి హనుమాన్‌కు విశేష అలంకారం చేసి సామూహిక క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణార్జున మూర్తులకు, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి, సూర్యభగవానునికి ప్రత్యేక అలంకారం చేసి పూజలు చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే వెలంపల్లి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. మహంతీపురంలోని దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి శ్రీసూక్తం, మన్యసూక్తం పఠిస్తూ అభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపారు.

కనులపండువగా హనుమాన్ శోభాయాత్ర





శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, శివస్వామి, దుర్గాప్రసాద్ స్వామీజీ ; శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిందూ సమాజం చైతన్యవంతం కావాలని దేశ రక్షణకు, సమాజ సేవకు ముందు ఉండాలని శైవపీఠాధిపతి శివస్వామి అన్నారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సంయుక్త ఆధ్వర్యాన స్థానిక సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం హనుమత్ జయంతి శోభాయాత్ర జరిగింది. శివస్వామి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దుర్గాప్రసాద్ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజులతో కలిసి శోభాయాత్రను ప్రారంభించారు. నగరంలో శోభాయాత్ర నిర్వహించటం శుభ పరిణామమని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. దుర్గాప్రసాద్ స్వామీజీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, విశ్వహిందూపరిషత్ ప్రాంత ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. మహిళలు తలపాగా పెట్టుకుని బుల్లెట్‌లపై శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయవాడ మహానగర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి రాఘవరాజు, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, భజరంగదళ్ ప్రముఖ్ శివప్రసాద్, శివాజీ, ఉపాధ్యక్షుడు జింకా చక్రధర్ పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. భారతీయ నృత్యాలు





విజయవాడకల్చరల్: కళావిపంచి హైదరాబాద్, శారదా కళాసమితి ఆధ్వర్యంలో నాట్యాచార్యుడు పండిట్ అంజిబాబు నేతృత్వంలో ఆదివారం గాంధీనగర్‌లోని కళాకారులు ప్రదర్శించిన భారతీయ నృత్యాలు జాతీయ సమైక్యతను చాటాయి. అంతర్జాతీయ నృత్య కళాకారిణి అచ్యుత మానస కథక్ సంప్రదాయంలో జయదేవుని అష్టపదులను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ నృత్య సంప్రదాయం కూచిపూడి నృత్యాలను మృణాళిని వాగ్గేయ కీర్తనలకు నృత్యాలను అభినయించారు. అతి ప్రాచీనమైన ఆంధ్రనాట్యం సంప్రదాయంలో నిఖిత గురువందనంతో ప్రారంభించి ఆలరింపు, ఆలయ నృత్యాలను ప్రదర్శించింది. జయపసేనాని వెలుగులోకి తీసుకు వచ్చిన పేరిణి సంప్రదాయంలో సాయివేదాంత్ ప్రదర్శించిన శివతాండవం సంప్రదాయ కీర్తనలకు చేసిన అంశాలు ఆకట్టుకున్నాయి. కథక్ కళాక్షేత్ర అధ్యక్షుడు పండిట్ అంజిబాబు మాట్లాడుతూ భారతీ నృత్య సంప్రదాయలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఏపీ ఫైబర్ నెట్ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. కవులు, కళాకారులు, చిత్రకారులను గౌరవించుకోవాలని సూచించారు. కళావిపంచి నిర్వాహకుడు బొప్పన నరసింహారావు మాట్లాడుతూ కృష్ణాతీరం సకల కళాతీరమన్నారు. శారదా కళాసమితి వ్యవస్థాపకుడు డోకిపర్తి శంకరరావు ప్రసంగించారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఎస్వీఆర్ కాపు సంక్షేమ సంఘం కమిటీ ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్లు, సంఘ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కాపు సామాజిక వర్గీయులు సంఘటితం కావాలని, అప్పుడే ఏదైనా సాధించుకోగలమని పలువురు కార్పొరేటర్లు, కాపు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం 45వ డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఐక్య సంక్షేమ సంఘం నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాయవాది పదిలం రాజశేఖర్, ఉపాధ్యక్షుడు దారపురెడ్డి ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి లింగం శివ ప్రసాద్, కోశాధికారి జవ్వాజి కొండలరావు, సహాయ కార్యదర్శి తంగా రవికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా దాసరి రవికుమార్, ముత్తా వాసు, సంపద చిరంజీవి, పసుపురెడ్డి సతీష్‌లను ఎన్నుకున్నారు. సభకు అధ్యక్షత వహించిన సంఘం మాజీ అధ్యక్షుడు పిట్టల సాంబశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కాపు సంక్షేమ భవన్ ఏర్పాటుకు కృషి

పశ్చిమ నియోజకవర్గంలో కాపు సంక్షేమ భవన్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పదిలం రాజశేఖర్, లింగం శివ ప్రసాద్ తెలిపారు. విద్యాధరపురం సితార జంక్షన్‌కు వంగవీటి మోహన రంగా జంక్షన్‌గా నామకరణం చేసేందుకు కృషి చేసిన 44, 45 డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురీ లావణ్యతోపాటు మైలవరపు సోదరులు కృష్ణ, దుర్గారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ జంక్షన్‌లోనే త్వరలో వంగవీటి రంగా విగ్రహాన్నికూడా ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం కూడా జరగటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, కార్పొరేటర్లు మైలవరపు మాధురి లావణ్య, మహదేవు అప్పాజీ, యలకల చలపతిరావు, కాపు నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, అత్తలూరి పెదబాబు, అమ్మిశెట్టి వాసు, సంఘం నాయకులు పత్తి నాగేశ్వరరావు, గునుగుల పుల్లయ్య, వల్లాని మాధవరావు, నవ్యాంధ్ర కాపు సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, వాసా ఆదినారాయణరావు పాల్గొన్నారు.

సమష్టి కృషితో క్రీడల అభివృద్ధి




మాట్లాడుతున్న ఏపీవోఏ ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: పరస్పర వివాదాలకు స్వస్తి పలికి సమష్టి కృషితో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ) ఉపాధ్యక్షుడు నామిశెట్టి వెంకట్, సభ్యులు ఆర్.డి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 13న ఏపీవోఏ కార్యదర్శి ఆర్.కె.పురుషోత్తం జూడో, అథ్లెటిక్స్ క్రీడలపై చేసిన వ్యాఖ్యలను ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జూడో సంఘంపై కేసు నమోదు చేస్తామని, అథ్లెటిక్స్ సంఘానికి అడహాక్ కమిటీ ఏర్పాటు చేస్తామని పురుషోత్తం పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. జూడో సంఘానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) మంజూరు చేసిన రూ.52 లక్షలపై వివాదం సృష్టించడం సబబుకాదన్నారు. నిబంధనలకు అనుగుణంగానే శాప్ మంజూరు చేసిన నిధులను విత్‌డ్రా చేశామన్నారు. క్రీడా సంఘాల మధ్య వివాదాలు సృష్టించడం వల్ల క్రీడాకారులు నష్టపోతున్నారన్నారు. ఫెడరేషన్‌లు గుర్తించిన సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఏపీవోఏ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న రెండు ఒలింపిక్ సంఘాలు ఒకే తాటి పైకి వస్తేనే రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఏపీవోఏపై బహిరంగ చర్చ జరగాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయ పడ్డారు. సమావేశంలో నెట్‌బాల్ సంఘం ప్రతినిధి బి.శివరాం, జూడో సంఘ ప్రతినిధి సుబ్బారావు, ఆట్యాపాట్యా సంఘ ప్రతినిధి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీ మహాయజ్ఞం



యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న పండితులు



విశేష అలంకారంలో అమ్మవారు



అనుగ్రహ భాషణం చేస్తున్న వేదాంతం రాజగోపాలచక్రవర్తి



వివిధ వేషధారణలో కళాకారులు

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞం మూడో రోజైన ఆదివారం శాస్త్రోక్తంగా సాగింది. యాగాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి అనుగ్రహ భాషణం చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ